సురక్షతో ఆరోగ్య భరోసా

- పెడన నియోజకవర్గంలో 28,464 మందికి వైద్య పరీక్షలు
- శిబిరాల ద్వారా ఉచితంగా వైద్య సేవలు, మందుల పంపిణీ
- 6 వేల మందికి పైగా కంటి పరీక్షలు
- ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలకు సిఫార్సు



పెడన శిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు (ఫైల్)



పెడన పీహెచ్‌సీ పరిధిలో గుండె పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

పెడన: పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే వివిధ పథకాల ద్వారా పేదలకు వైద్యం అందిస్తోంది. ఇంకో అడుగు ముందుకు వేసి పేదల చెంతకు వైద్యం చేరువ చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి అన్నివర్గాల ప్రజలకు నిపుణులైన వైద్యు లతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాలకు విశేష స్పందన లభించింది. ప్రజలు అధిక సంఖ్యలో వైద్య సేవలు పొందారు. పెడన నియోజకవర్గంలో ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా నాలుగు మండలాల్లో 16 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలలో ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా పరీక్షలు నిర్వహించడమే కాకుండా అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు ఆరోగ్యశ్రీ ద్వారా సిఫార్సులు చేశారు. నియోజకవర్గంలో జరిగిన శిబిరాల్లో 28,464 మంది రోగులు వైద్య నిపుణుల వద్ద పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో కంటి పరీక్షలు సుమారు ఆరువేల మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. 168 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వివిధ శస్త్ర చికిత్సలకు సిఫార్సులు చేశారు.

మండలాల వారీగా...

పెడన మండలంలో పెడన, చేవేంద్ర, అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో 8,055 మంది రోగులు ఓపీలో నమోదు అయి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 1,940 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వీరిలో కొందరిని కళ్లజోళ్లకు సిఫార్సు చేసి కంటి వెలుగు ద్వారా ఉచితంగా కళ్లజోళ్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 136 మందికి వివిధ శస్త్ర చికిత్సల నిమిత్తం సిఫార్సులు చేశారు. కృత్తివెన్ను మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 5,891 మంది ఓపీలో నమోదయ్యారు. వీరిలో 2,324 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 422 మందిని కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. అలాగే 69 మందికి వివిధ శస్త్ర చికిత్సలకు ఆరోగ్యశ్రీ ద్వారా రిఫర్ చేశారు. గూడూరు మండలంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మరో సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించిన జగనన్న వైద్య శిబిరాల్లో 7,109 మంది ఓపీ నమోదు చేయించుకుని వివిధ పరీక్షలు చేయించుకున్నారు. బంటుమిల్లి మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 7,769 మంది ఓపీ నమోదు చేయించుకుని పరీక్షలు చేయించుకున్నారు.

చాలా సంతోషం



60 ఏళ్ల వయస్సు ఉన్న నాకు షుగర్ ఉంది. గతంలో ఆర్‌ఎంపీల వద్ద చూపించుకునే వాడిని. జగన్ ప్రభుత్వం వచ్చాక మాకు దగ్గరగా గరిశపూడిలో ఆస్పత్రి (వైఎస్సార్ క్లినిక్) ఏర్పాటు చేశారు. అక్కడే ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి మందులు కూడా ఇస్తున్నారు. ఇప్పుడు గ్రామంలోనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఎన్నో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, సూచనలు ఇచ్చారు. మా గ్రామంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది.

–నడకుదుటి బాలకృష్ణ, కృత్తివెన్ను మండలం చినచందాల

ఉచితంగా మందులు ఇచ్చారు



మాది 14వ వార్డు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెళ్లా. వైద్య నిపుణులు వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. ఈ విధంగా గతంలో ఎన్నడూ చేసిన దాఖలాలు లేవు. ఎవరైనా స్వచ్ఛంద సంస్థలు మాత్రమే వైద్య శిబిరాలు నిర్వహించారు. వాటిలో ఇన్నిరకాల పరీక్షలు చేయలేదు. ప్రభుత్వమే ప్రతి మండలంతో పాటు పట్టణంలో కూడా వైద్య శిబిరాలను నిర్వహించి నిరుపేదలకు వైద్య సేవలు అందించడం అభినందించదగ్గ విషయం.

– ఎస్. ఫణికుమారి, 14వ వార్డు, పెడన

క్లుప్తంగా

డీఎల్‌డీఓ కేవీ సుబ్బారావు బాధ్యతల స్వీకారం



చిలకలపూడి(మచిలీపట్నం): గుడివాడ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా కేవీ సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు డీఎల్‌డీఓగా పనిచేసిన ఎం. సుబ్బారావు ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓగా బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఘంటసాల ఎంపీడీఓగా పనిచేస్తున్న కేవీ సుబ్బారావును పదోన్నతిపై గుడివాడ డీఎల్‌డీఓగా నియమించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ పి. రాజాబాబును ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన బాలలు



మంగళాపురం(చల్లపల్లి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో చల్లపల్లి మండలం మంగళాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ బాలలు సత్తా చాటారు. అండర్–17 డిస్కస్ త్రోలో పి.స్వాతి ప్రథమ స్థానం, హ్యామర్ త్రోలో పి.రాజేశ్వరి, కె.శరత్ ప్రథమ స్థానం, కె.శ్రావ్య ద్వితీయ స్థానం, జావెలిన్ త్రోలో బి.జ్యోతిసాయి ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో కె.వాసవి ప్రథమ స్థానం, పి.ఇంద్రలక్ష్మి ద్వితీయ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్‌ఎం వీవీ రమణ, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ కె.నాగలక్ష్మి, పీఈటీ సీహెచ్ రామకృష్ణ అభినందించారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేయాలి

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఝాన్సీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి గ్రామ వలంటీర్లతో ఇంటింటి సర్వే చేయించి క్రీడాకారులను గుర్తించాలన్నారు. తద్వారా గ్రామ స్థాయి జట్లను ఎంపిక చేసి పోటీలు నిర్వహించాలని చెప్పారు. వారిలో ప్రతిభావంతులను గుర్తించి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లే అవుట్ పరిశీలన



మోపిదేవి: ప్రభుత్వం కేటాయించిన లే అవుట్లలో నిబంధనలు అతిక్రమించి గృహ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని గృహ నిర్మాణ శాఖ డీఈ భానోజీరావు హెచ్చరించారు. మోపిదేవి లే అవుట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి గృహానికి నిర్దిష్ట కొలతలతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించిందని, ఆ నిబంధనలు అతిక్రమించినా, ఆక్రమణలు చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ మండల ఏఈ తాండవకృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు గడప గడకు మన ప్రభుత్వం

బంటుమిల్లి: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మల్లంపూడి సచివాలయం పరిధి నాగన్నచెరువు, మల్లంపూడి గ్రామాల్లో శనివారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వేగంగా రోడ్డు మరమ్మతు పనులు

గూడూరు: గూడూరులోని టెలిఫోన్ ఎక్సేంజ్ కూడలిలో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను ఎంపీపీ సంగా మధుసూదనరావు శుక్రవారం పరిశీలించారు. ఎంపీపీ ప్రత్యేక శ్రద్ధతో రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. పాడైన రోడ్డును జేసీబీతో తొలగించి కాంక్రీటుతో పూర్తి స్థాయి మరమ్మతు పనులు రెండు రోజులుగా సాగుతున్నాయి. నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీపీ మధుసూదనరావు, రైల్వే బోర్డు సభ్యుడు ఎం. రత్నారావు సంతృప్తి వ్యక్తం చేశారు. బమిరియాల గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సుదూరం వెళ్లి పింఛన్ల అందజేత



విజయవాడ ఆస్పత్రిలో లీలాకృష్ణకుమారికి పింఛను అందిస్తున్న వలంటీర్ జరీనా



ఏలూరులో రాజేశ్వరికి పింఛను అందజేస్తున్న వలంటీరు దిల్షాద్‌బేగం

చల్లపల్లి: వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారులు ఎక్కడ, ఏ పరిస్థితుల్లో ఉన్నా గ్రామ వలంటీర్లు సకాలంలో పింఛన్లు అందిస్తున్నారు. చల్లపల్లి గ్రామ సచివాలయం–1 పరిధిలోని వితంతు పింఛను లబ్ధిదారు గురుగు లీలాకృష్ణకుమారి అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ మహమ్మద్ పరీన్ జరీనా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది. ఆస్పత్రిలో ఉన్నా ఠంచనుగా పింఛను అందించిన గ్రామ వలంటీరుకు లబ్ధిదారు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఏలూరు వెళ్లి పింఛను అందజేత..

పెడన: పెడన 16వ వార్డు రౌతులవారి వీధికి చెందిన మాదాసు రాజేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందింది. చికిత్స అనంతరం ఆమె కుమార్తె వద్ద ఏలూరులోనే ఉంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ దిల్షాద్ బేగం ఏలూరు వెళ్లి రాజేశ్వరికి పింఛను సొమ్మును అందజేసింది. ఇంత దూరం వచ్చి పింఛను అందజేసిన వలంటీర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

పింఛన్ల పంపిణీలో బందరుకు ద్వితీయ స్థానం..

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగర పాలక సంస్థ 3వ రోజు శుక్రవారం ద్వితీయ స్థానంలో నిలిచింది. నగరంలో మొత్తం 19,048 మంది పింఛనుదారులు ఉండగా వీరిలో 18,572 మందికి పింఛన్లు పంపిణీ చేసి 97.50 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఇంకా 476 మందికి పింఛన్లు అందజేస్తే నూరుశాతం పంపిణీ పూర్తవుతుంది.

యంత్రంతో కలుపు మందు పిచికారీ



పసుపు పైరుపై స్ప్రేయర్‌తో కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతు

మోపిదేవి: యంత్రంతో కలుపు మందు పిచికారీపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మోపిదేవికి చెందిన రావి సురేష్ తమ పసుపు పైరులో యంత్రం సహాయంతో శుక్రవారం కలుపు మందు పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ కలుపు మందు పిచికారీకి స్ప్రేయర్‌ను ఉపయోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ పంటకు కలుపు మందు పిచికారీ చేయవచ్చునన్నారు. ఇటీవల రూ. 85 వేలతో ఈ స్ప్రేయర్‌ను తీసుకువచ్చామని చెప్పారు. ఈ స్ప్రేయర్ ట్యాంకులో 300 లీటర్ల వరకు కలుపు మందు కలపవచ్చునని, పిచికారీకి 360 మీటర్ల పొడవాటి పైపు ఉన్నందున అంతదూరం వరకు మొక్క మొత్తం తడిచేలా మందు పిచికారీకి అవకాశం ఉందని చెప్పారు. కేవలం పసుపు, కంద పంటలకే కాకుండా పలు రకాల వాణిజ్య కూరగాయ పంటలు, మినుము, మామిడి, అరటి వంటి తోటలకు కూడా స్ప్రేయర్ ఉపయోగించవచ్చునని వివరించారు. అవసరమైన చోట్ల ట్రాక్టర్‌కు తగిలించి ఈ స్ప్రేయర్ ఉపయోగించవచ్చునని వివరించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా నగేష్



నూతన కార్యదర్శి నగేష్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్‌కు అప్పగించారు. నగేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం విజయవాడ వెళ్లి గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మను మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. కాగా, అక్టోబరు 27వ తేదీన ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న రోజునే పౌర గ్రంథాలయశాఖ డైరెక్టర్ ప్రసన్నకుమార్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన కనీసం చైర్‌పర్సన్‌కు చెప్పకుండా గోప్యంగా ఉంచారు. 30వ తేదీ వరకు చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మకు విషయం తెలియకపోవడంతో ఆమె కార్యదర్శి బదిలీ అంశం చర్చించేందుకు డైరెక్టర్ ప్రసన్నకుమార్‌ను కలిశారు. ఇప్పటికే రవికుమార్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చామని చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మకు తెలిపారు. విషయం తెలుసుకున్న జమలపూర్ణమ్మ బదిలీ ఉత్తర్వులు అమలు చేసేందుకు పూనుకోవడంతో కార్యదర్శి రవికుమార్ గురువారం నగేష్‌కు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు.

విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నగేష్‌ను చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ సత్కరించారు. ఆదివారం విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో ఉదయం 9 గంటలకు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని శాఖా గ్రంథాలయ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని కార్యదర్శి నగేష్ 'సాక్షి'కి తెలిపారు.

పెదకళ్లేపల్లిలో రేషన్ బియ్యం పట్టివేత



మోపిదేవి: పెదకళ్లేపల్లిలో 80 బ్యాగుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని విజిలెన్స్ ఇన్‌చార్జి ఏఎస్ఓ ప్రధాన్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పెదకళ్లేపల్లిలోని కందుల వెంకన్నబాబు ఇంటిలో సోదా చేసి 80 బ్యాగుల రేషన్ బియ్యాన్ని గుర్తించామని చెప్పారు. ఈ బియ్యాన్ని స్థానిక రైస్‌మిల్‌కు తరలిస్తున్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ



బంటుమిల్లి: మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26న ఆచార్య దేవోభవ అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్ తెలిపారు. పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఓ. మహేశ్వరి, వీఎస్ఎల్ శ్రీవిద్య, పి. లక్ష్మీ సక్కుబాయి, ఎస్. సంజన, ఎ. హనీశ్రీలు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలను పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: అవనిగడ్డలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

- **మోపిదేవి:** అవనిగడ్డలోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పాండురంగారావు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

10 వేల మందికి అన్నదానం



బంటుమిల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక కనకదుర్గ గుడి వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల నుంచి సుమారు 10 వేల మంది పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ట్రస్టీ గరికపాటి కూనారావు పర్యవేక్షించారు.

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

డీవైఈఓ సుబ్బారావు



పెడన: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని మచిలీపట్నం ఉప విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూల్‌లో శుక్రవారం వార్షిక క్రీడలను డీవైఈఓ సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. విద్య విద్యార్థులకు ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని చెప్పారు. ఆరోగ్యంగా ఉంటే చదువుపై శ్రద్ధ పెడతారన్నారు. స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ ఉన్నత భవిష్యత్‌కు క్రీడలు చక్కటి మైలురాయి అని తెలిపారు. అకడమిక్ స్టడీస్, అథ్లెటిక్ సామర్థ్యాలు ఒక దానితో మరొకటి సంబంధం కలిగి ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ రాజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9 నుంచి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి'

పెడన: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఈ నెల 9వ తేదీ నుంచి గడప గడపకు జరుగుతుందని, పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమ సన్నాహక సమావేశం శుక్రవారం పెడన మార్కెట్ యార్డులో పెడన మండలం వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో జరిగింది. నాగబాబు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ జగనే మనకు మళ్లీ కావాలనే విషయాన్ని చెప్పాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరికిపాటి వెంకట రామానాయుడు, దావు భైరవలింగం, బెజవాడ నాగబాబు, పామర్తి సాంబశివరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలంకారీ పరిశ్రమను సందర్శించిన నీడ్ విద్యార్థులు



పెడన: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం పెడనలోని కోరమండల్ కలంకారీ పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమ యజమాని పిచ్చుక వరుణ్‌కుమార్ విద్యార్థులకు కలంకారీ వస్త్రాల తయారీ, వాటిపై ముద్ర ఎలా వేయాలి, సహజ సిద్ధ రంగుల కోసం ఏయే ఆకులు, కాడలు, వేర్ల ద్వారా ఏ రంగులు వస్తాయనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కనక మహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాంబాబు



మాట్లాడుతున్న బీఎం నాగేశ్వరరావు. చిత్రంలో చైర్మన్ రాంబాబు, డైరెక్టర్లు

మచిలీపట్నంటౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని కనకమహాలక్ష్మీ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కె. రాంబాబు అన్నారు. బ్యాంక్ రజతోత్సవ కస్టమర్ మీట్‌ను నగరంలోని బ్యాంక్ బ్రాంచ్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి రాంబాబు మాట్లాడుతూ బ్యాంక్ స్థాపించి 24 ఏళ్లు పూర్తయి 25వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన తరుణంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 28 శాఖలతో నడుస్తోందన్నారు. 1,707 మంది సభ్యులతో, రూ. 38.38 లక్షల షేర్ ధనంతో, ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైందని చెప్పారు. బ్యాంక్ దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17,288 మంది సభ్యులతో రూ. 31 కోట్ల వాటాధనంతో అర్బన్ కో–ఆపరేటివ్ రంగంలో ముందంజలో నడుస్తోందన్నారు. సాంకేతికంగా కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా తమ బ్యాంక్ ఖాతాదారులకు సేవలందిస్తోందని చెప్పారు. మచిలీపట్నంలో బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటైన నాటి నుంచి ఖాతాదారులు, శ్రేయోభిలాషుల సహాయ సహకారాలతో ముందుకు సాగుతోందన్నారు. తమ బ్రాంచ్‌లలో ఏటీఎంలు, మొబైల్ బ్యాంకింగ్, ఆర్‌టీజీఎస్, యూపీఐ తదితర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని, రుణ ఖాతాదారులకు పాస్‌బుక్‌లను ఇవ్వాలని ఖాతాదారులు చైర్మన్‌ను కోరారు. సందర్భంగా ప్రముఖ ఖాతాదారులను చైర్మన్ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు సీపీ రామారావు, జీఆర్‌కే ప్రసాద్, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. శ్యామ్‌కిషోర్, రీజనల్ మేనేజర్ కె. మురళి, బ్రాంచ్ మేనేజర్ ఎస్. నాగేశ్వరరావు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మల్లవోలు విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు.

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలకు విద్యార్థులు ఏడుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 పోటీల్లో ఎస్. నందిని, టి. శ్రావణి, వి. ప్రవీణ్‌కుమార్, ఎస్‌కే బాషా, సాంబశివరావు కబడ్డీ పోటీల్లో విశేష ప్రతిభ చూపడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. అండర్ 17లో ఎం. లలితాదేవి ఫుట్‌బాల్‌కు, రిషిత సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు అభినందించారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ

గూడూరు: అండర్ 14, 17 విభాగాల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మల్లవోలు ఉన్నత పాఠశాల బాలబాలికలు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడలోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్లో గత నెల 30న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 14 బాలుర విభాగంలో ఎస్. సందీప్‌వర్ధన్, వి. గోపీచంద్, బాలికల విభాగంలో బి. రత్నకుమారి, పి. రూత్‌ప్రేసీ, డి. హర్షిత ఎంపికయ్యారని చెప్పారు. అండర్ 17 బాలుర విభాగంలో వి. కౌసిక్, పి. త్రినాథ్, బాలికల విభాగంలో జి.కెజియా, జి. శ్రావణలక్ష్మీ, కె. దీపిక ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామోపాధ్యాయులు ఎస్. శ్రీనివాస్, పి. రవిలను ఆమె అభినందించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఎంట్రన్స్ ప్రాంతంలో ప్రధాన రహదారి వెంట ముళ్లచెట్లను శుక్రవారం తొలగించారు. రహదారి పక్కనున్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జి. దుర్గారమేష్, పీఓ అన్నపరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- **కోనేరుసెంటర్:** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ చలమలశెట్టి రమేష్‌బాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ఎంతో మంది జర్నలిస్టులకు ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. సీఎం జగన్, రాష్ట్ర మంత్రి వర్గానికి కృష్ణాజిల్లా శాఖ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.